
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY




ఆస్పత్రిలో రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

- కొండాపూర్ ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 27: మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు, జ్వరాల నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ శశాంక వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కొండాపూర్ ఏరియా ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏరియా ఆస్పత్రి వైద్య సిబ్బందితో పాటు రోగులకు సంబంధించిన వార్డులను పరిశీలించారు. ఆస్పత్రి పరిధిలోని ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకాకుండ తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతిరోజూ సగటున ఎంతమంది రోగులు ఆస్పత్రికి వస్తున్నారు? వారిలో ఎంతమంది ఇన్ పేషంట్లుగా అడ్మిట్ అవుతున్నారు, డెంగీ, మలేరియా, విషజ్వరాలు వంటి వాటితో ఎంతమంది చికిత్సలు పొందుతున్నారనే వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అలాగే రోగులను పలకరించి అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఏరియా ఆసుపత్రికి వైద్యం కొరకు ఎక్కడెక్కడి నుండి ప్రజలు వస్తారని వైద్య సిబ్బందిని అడిగి ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత డాక్టర్లకు, సిబ్బందికి సూచించారు. వైద్య పరీక్షలు నిర్వహించి వివరాలు రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా జ్వరాలతో ఆసుపత్రులకు వచ్చే ప్రతీ ఒక్కరికి రక్త నమూనాల సేకరణ, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్, డయేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా, మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆయన వెంట డాక్టర్ జి.రాజు, డీసీహెచ్ఎస్, డాక్టర్ జి.అనురాగిణిరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రకృష్ణ, ఆర్ఎమ్ఓ డాక్టర్ సుధాకర్, సీఎస్ జనరల్ మెడికల్ హేమలత, న్యూరో సూపరింటెండెంట్ శ్రీమతి హెప్సిబా, ఇన్ఫెక్షన్ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ అపర్ణ, టి హబ్ ఇన్‌చార్జి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌బడ్జెట్ కేటాయింపు, వినియోగం వివరాలు (రూ.లక్షలల్లో)		
రంగారెడ్డి జిల్లా		
జిల్లా	కేటాయింపు	వినియోగం
పెద్ద అంబర్‌పేట	1055.80	172.00
బడంగపేట	2,949.10	1,183.53
జల్‌పల్లి	658.37	219.78
మీర్‌పేట	1,490.48	304.72
శంషాబాద్	831.96	250.00
తుర్కయాంజల్	1,277.61	232.12
మణికొండ	2,788.37	1,884.96
నార్సింగ్	530.62	395.62
బండ్లగూడజాగీర్	1,379.22	402.09
ఆదిభట్ల	454.28	424.63
తుక్కుగూడ	601.50	142.00
మేడ్చల్ జిల్లా		
బోడుప్పల్	2,618.33	1055.06
ఫిర్జాదీగూడ	1851.61	1038.18
జవహర్‌నగర్	460.00	148.00
దమ్మాయిగూడ	871.06	391.58
నాగారం	997.23	801.03
పోచారం	749.81	398.63
ఘట్‌కేసర్	664.07	179.69
గుండ్లపోచంపల్లి	785.28	584.92
తూంకుంట	869.69	739.23
నిజాంపేట	3,453.57	1904.08
కొంపల్లి	1,185.64	562.93
దుండిగల్	1,663.00	992.00
మొత్తం	30187.10	14406.78



- ఎక్కడా కానరాని పచ్చదనం
- నాలుగేళ్లలో కేవలం సగం నిధులే ఖర్చు
- శివారు బల్దియాలకు రూ.301.87 కోట్లు విడుదల
- వినియోగించిన నిధులు రూ.144.06 కోట్లే
- ఇందులోనూ వెలుగుచూసిన అక్రమాలు

అటకెక్కిన గ్రీన్‌బడ్జెట్!

పురపాలికల్లో నిరుపయోగంగా నిధులు

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా ఉంది మున్సిపాలిటీల పరిస్థితి. పలు ప్రభుత్వ పథకాల అమలుకు నిధులు అందుబాటులో ఉన్నా పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం వల్ల అవి నీరుగారి పోతున్నాయి. మున్సిపాలిటీల్లో అమలు చేస్తున్న గ్రీన్ బడ్జెటే ఇందుకు నిదర్శనం. పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వం కేటాయిస్తున్న ఈ బడ్జెట్ అధికారుల నిర్లక్ష్యం వల్ల నిరుపయోగంగా మారుతోంది. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని 23 పురపాలికల్లో ఈ నిధుల వినియోగం గడిచిన నాలుగేళ్లుగా అంతంత మాత్రంగానే ఉంది. గ్రీన్‌బడ్జెట్ కింద ప్రభుత్వం రూ.301.87 కోట్లు విడుదల చేయగా అందులో సగం కూడా ఇప్పటి వరకు ఖర్చుపెట్టలేదు. కొన్నిచోట్ల కనీసం 20 శాతం నిధులు కూడా ఖర్చుపెట్టకపోవడం గమనార్హం.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

ప్రభుత్వం అట్టహాసంగా మున్సిపాలిటీల పరిధిలో పచ్చదనాన్ని పెంచేందుకు గ్రీన్ బడ్జెట్ కింద నిధులు విడుదల చేసింది. కానీ వాటిని వినియోగించడంలో మాత్రం పాలక వర్గాలు విఫలమవుతున్నాయి. దీంతో వచ్చిన నిధులు వచ్చినట్లు బ్యాంకుల్లోనే మూలుగుతున్నాయి. నగర శివారులోని 23 బల్దియాలకు నాలుగేళ్లుగా ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో కనీసం సగం కూడా వినియోగించలేదంటే అతిశయోక్తి కాదు. గ్రీన్ బడ్జెట్ కింద దండిగా నిధులు ఉన్నపట్పికీ వీటిని ఉపయోగించుకోవడం గమనార్హం. ఇందులో పాలకవర్గాల పాపాలు కూడా ఉన్నాయి. పెద్దఅంబర్‌పేట, బడంగపేట, మీర్‌పేట, తుర్కయాంజల్, తుక్కుగూడ పురపాలికల్లో కనీస స్థాయిలో కూడా ఈ నిధులు ఖర్చుపెట్టలేదు.

అంతంతమాత్రంగానే మొక్కలు నాటే ప్రక్రియ

పురపాలికల్లో పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటి వాటి సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఏటా గ్రీన్ బడ్జెట్ కింద నిధులు మంజూరు చేస్తోంది. ఈ నిధులతో పురపాలికల్లోని పార్కులు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, స్కూళ్లు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలి. అలాగే వీటి సంరక్షణకు ట్రీ గార్డులను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ స్కూళ్లకు ఈ నిధుల్లో పదిశాతం ఖచ్చితంగా ఖర్చుపెట్టాలనే నిబంధన పెట్టారు. వాస్తవానికి హరితహారం పథకం ప్రారంభమైన సమయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉధృతంగా చేపట్టాలని భావించిన ప్రభుత్వం గ్రామ, పట్టణ



ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో పాలక వర్గ సభ్యులను భాగస్వాములుగా చేసింది. కనీస స్థాయిలో మొక్కలు నాటకున్నా, నాటిన మొక్కలు బతకకపోయినా స్థానిక పాలవర్గాలను బాధ్యులుగా చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. హరితహారం పథకం ప్రారంభ సమయంలో కొందరిపై చర్యలు కూడా తీసుకున్నారు. అయితే తరువాత దీనిపై ప్రజా ప్రతినిధుల నుంచి వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. దీంతో చివరకు ఈ కార్యక్రమం పట్టణ ప్రాంతాల్లో నీరుగారి పోయింది. ఈ పథకం కింద పురపాలికలకు ప్రత్యేకంగా కేటాయించిన గ్రీన్ బడ్జెట్ నిధులు కూడా సద్వినియోగం చేసుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. నగర శివారు మున్సిపాలిటీల్లోనే కాదు గ్రామీణ ప్రాంతాల్లో కూడా హరితహారం కార్యక్రమం ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. ఈ ఏడాది మొక్కలు నాటే కార్యక్రమం అంతంత మాత్రంగానే సాగుతోంది.

తప్పుడు రికార్డులతో..

గ్రీన్ బడ్జెట్ నిధులు పలు చోట్ల భారీగా దుర్వినియోగమవుతున్నాయి. అసలు ఈ నిధులు అంతంత మాత్రంగా ఖర్చుచేస్తున్నప్పటికీ ఇందులో కూడా అక్రమాలు జరుగుతున్నాయి. మొక్కలు నాటకుండానే నాటినట్లు రికార్డులు చూపుతున్న ఉదంతాలు కూడా గతంలో వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వమే నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు ఉచితంగా అందజేస్తోంది. అయితే మొక్కలు నాటేందుకు అయ్యే ఖర్చులో వీటి సంరక్షణ ఖర్చులు కొన్ని చోట్ల అధికంగా చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల ప్రైవేటు నర్సరీల నుంచి కూడా మొక్కలు కొనుగోలు చేసి బిల్లులు రాబట్టుకుంటున్నారు. ప్రభుత్వం వీటన్నింటిపై దృష్టిపెట్టి హరితహారం కార్యక్రమం ముందుకు తీసుకునేందుకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 27: అర్హులందరికీ రూ.2 లక్షల రుణమాఫీని ఏకకాలంలో విడుదల చేయాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. ఎన్నికలకు ముందు రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని మేనిఫెస్టోలో చేర్చి ఇప్పుడు అనేక తికమకలు పెట్టి రైతులను ఇబ్బంది పెట్టడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని రోజురోజుకు నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ముందు దోషిగా నిలబడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, కావలి నరసింహ, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, ప్రభులింగం, ఓరుగంటి యాదయ్య, పబ్బతి లక్ష్మణ్, నీలమ్మ, భారత రాజు, నరసింహ తదితరుల పాల్గొన్నారు.


బస్టాండ్ ఎదురుగా అడ్డదిడ్డంగా పార్క్ చేసిన వాహనాలు

- తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్య
- రోడ్లపై అడ్డగోలుగా వాహనాల పార్కింగ్
- అద్దెకు సెల్లార్లు.. అయినా రహదారిపైనే
- ఇష్టారీతిన తిరుగుతున్న పశువులు
- రోడ్డెక్కాలంటే జంకుతున్న స్థానిక జనం

షాద్‌నగర్‌లో ట్రాఫికర్!

షాద్‌నగర్‌రూరల్ ఆగస్టు 27: షాద్‌నగర్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు తీవ్రమవుతోంది. జనాభాకు అనుగుణంగా రోడ్లు విస్తరించకపోవడం, ఉన్న రోడ్లపై వాహనాలు ఇష్టానుసారంగా పార్క్ చేయడంతో వాహనదారులు నిత్యం నరకయాతన పడుతున్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పరిగి రోడ్డుపై భయం భయంగా...

పరిగి రోడ్డుపై ప్రయాణం అంటేనే వాహనదారులు జంకుతున్నారు. పరిగి వైపు నుంచి షాద్‌నగర్ వచ్చే దారిలో సబ్‌స్టేషన్ నుంచి ముఖ్య కూడలి వరకు సమస్య తీవ్రంగా ఉంది. హనుమాన్ దేవాలయం నుంచి సైతం అదే పరిస్థితి. సాయంత్రమైతే అటుగా వెళ్లాలంటే భయపడుతున్నారు. దుకాణాల ఎదుట రోడ్డు వరకు వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. కొన్ని భవనాల యజమానులు సెల్లార్లను అద్దెకు ఇవ్వడంతో వాహనాలను రోడ్డుపై పెట్టాల్సి వస్తోంది. దాంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. అలాగే ముఖ్య కూడలి నుంచి పరిగి వెళ్లే దారిలో బస్టాండ్ ఎదుట ప్యాసింజర్ ఆటోలు, జీపులు రోడ్డుపైనే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. బస్టాండ్ నుంచి అన్ని రూట్లలో వెళ్లే బస్సులు పరిగి రోడ్డు నుంచి బయటికి వస్తాయి. రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు కలుగుతున్నాయి.

ప్రధాన రోడ్డు పరిస్థితి దారుణం

హైదరాబాద్ వెళ్లే దారిలో ముఖ్య కూడలి నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు జీపులు, ఇతర వాహనాలు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. రెండు లైన్ల రోడ్డు ఉండగా ఒక లైన్ పూర్తిగా వాహనాల పార్కింగ్‌తో నిండి ఉంటుంది. జడ్చర్ల వైపు వెళ్లే దారి, వచ్చేదారి పరిస్థితి కూడా అదే విధంగా ఉంది. ఇక ప్రధానంగా మెయిన్ రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంది. తోపుడు బండ్లు, వీధి వ్యాపారాలు, ఇతర దుకాణాలు రోడ్డుపై పెట్టడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గతంలో వీధి వ్యాపారాలు, తోపుడు బండ్లను రాకుండా చేశారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అన్ని రూట్లలో వెళ్లే ప్యాసింజర్ వాహనాలకు ముఖ్య కూడలికి దూరంగా పార్కింగ్ ఏర్పాటు చేస్తే కొంత వరకు సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నారు.

పశువులతో తప్పని తిప్పలు

పట్టణంలో రోడ్లపై పశువులు గుంపులు గుంపులుగా తిరుగుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఓ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా పశువు ఢీకొని మృతి చెందిన విషయం తెలిసిందే. మున్సిపల్ అధికారులు చాలా సార్లు పశువులు రోడ్లపై తిరిగితే యజమానులపై చర్యలు తీసుకుంటామని దండోరా వేయించడం జరిగింది. కానీ ఆచరణలో అమలు చేయలేదు. ముఖ్యంగా ముఖ్య కూడలిలో రోడ్డుపై గుంపులుగా పడుకుంటున్నాయి. దాంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సార్లు పశువులు కూడా ప్రమాదాల బారిన పడుతున్నాయి.

బయటకు రావాలంటే భయమేస్తోంది



షాద్‌నగర్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. వాహనాలతో బయటికి రావాలంటే భయమేస్తోంది. ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి సమస్యను త్వరగా పరిష్కరించాలి.

-వెంకన్నబాబు, షాద్‌నగర్

త్వరలోనే పరిష్కారం

షాద్‌నగర్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రచిస్తున్నాం. మున్సిపల్ అధికారులతో మాట్లాడి సెల్లార్ల విషయంపై కూడా చర్చిస్తాం. ముందుగా అవగాహన కల్పించి మారకపోతే తదుపరి చర్యలు ఉంటాయి.

-చంద్రశేఖర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్


బస్టాండ్ ఎదుట పరిగి వెళ్లే దారిలో రోడ్డుపై నిలిపిన ఆటోలు


అలుగుకు మరమ్మతులు చేస్తున్న గ్రామస్తులు

సౌడమ్మ చెరువు అలుగుకు బుంగ

- తాత్కాలిక మరమ్మతులు చేసిన గ్రామస్తులు
- మత్తడిని పటిష్టం చేయాలంటున్న రైతులు

కందుకూరు, ఆగస్టు 27: పులిమామిడిలోని సౌడమ్మ చెరువు అలుగుకు బుంగ(రంధ్రం) పడి నీరు వృథాగా పోయింది. వారం క్రితం కురిసిన వర్షానికి ఈ చెరువు నిండింది. రెండు రోజులుగా అలుగు(మత్తడి) కింది భాగంలో రాతి కట్టడంలో చిల్లుపడి నీరు వృథాగా పోతోంది. గమనించిన కాంగ్రెస్ నాయకుడు బుక్క పాండురంగారెడ్డి, గ్రామస్తులు మంగళవారం కాంక్రీట్‌తో తాత్కాలిక మరమ్మతులు చేశారు. నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి అలుగుకు శాశ్వత మరమ్మతులు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.


అలుగుకు బుంగ పడి వృథాగా పోతున్న నీరు

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

- డీఈవో సుశీందర్‌రావు


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో సుశీందర్‌రావు

ఆమనగల్లు, ఆగస్టు 27: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని డీఈవో సుశీందర్‌రావు తెలిపారు. విద్యలో వెనుక బడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతుల ద్వారా బోధించాలని సూచించారు. మంగళవారం ఆయన ఆమనగల్లు, మాడ్గుల మండలాల్లో పర్యటించారు. మాడ్గుల జెడ్పీ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, రికార్డులను, విద్యార్థులకు సిద్ధం చేసిన మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా కేజీబీవీ ఎస్‌వో రేఖకు డీఈవో సుశీందర్ రావు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈవో సర్దార్‌నాయక్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ లక్ష్మయ్య, సీఆర్‌పీ జలందర్ రెడ్డి, సిబ్బంది తిరుపతి తదితరులు ఉన్నారు.

మాడ్గుల: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని మంగళవారం డీఈవో సుశీందర్‌రావు సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని కేజీబీవీ స్పెషల్ అధికారి సీహెచ్ రేఖకు సూచించారు. అలాగే విద్యార్థినుల హాస్టల్ పరిస్థితిని అడిగి తెలుసుకోన్నారు.

60 కిలోల గంజాయి పట్టివేత

వైజాగ్ నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా అరెస్ట్


నిందితులు రూపా మొహిత్, వేదరాం చవాన్


వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 27: ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి రాయపోల్ వద్ద రాచకొండ కమిషనరేట్ మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ టీం, ఇబ్రహీంపట్నం పోలీసులు మంగళవారం ఉదయం కారులో తరలిస్తున్న 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. రాచకొండ సీపీ సుధీర్ బాబు కమిషనరేట్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర నాసిక్‌కు చెందిన వాల్మీక్ రూపా మొహిత్(53), మహారాష్ట్ర దూలే తాలూక్ల టిక్కికి చెందిన బాతు వేదరాం చవాన్(39) మారుతి స్విఫ్ట్ కారులో విశాఖపట్నం జిల్లా పెందుర్తి నుంచి నాసిక్‌కు గంజాయిని తరలిస్తుండగా వారి నుంచి 30 పాకెట్లలోని 60 కేజీల గంజాయితో పాటు రూ.1500 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సొత్తు విలువ రూ.35 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. రూపా మొహిత్ ట్రాన్స్‌పోర్టు వాహనం నడిపేవాడు కాగా, దగ్గరి బంధువైన వేదరాం చవాన్‌ను హెల్పర్‌గా పెట్టుకున్నాడు. చవాన్ గంజాయికి అలవాటు పడ్డాడు. అతని ద్వారా గంజాయి సరఫరాదారుడు అరకుకు చెందిన తిరుపతి అనే వ్యక్తి పరిచయమయ్యాడు. టాన్స్‌పోర్టు వ్యాపారంలో రూపా మొహిత్‌కు ఆర్థికంగా నష్టం రావడంతో గంజాయి సరఫరాతో ఆర్థికంగా బలపడవచ్చని ప్లాన్ చేసుకున్నాడు. ట్రాన్స్‌పోర్టు వాహనాన్ని విక్రయించి మహారాష్ట్ర నంబర్ ప్లేట్‌తో ఉన్న స్విఫ్ట్ కారు కొనుగోలు చేశాడు. తిరుపతిని సంప్రదించి ఈ నెల 25న విశాఖపట్నం సమీపంలోని పెందుర్తి వద్ద గంజాయిని తీసుకుని ఏపీకి చెందిన నకిలీ నంబర్ ప్లేట్‌ను అమర్చి రాజమహేంద్రవరం, విజయవాడ, మీదుగా సూర్యాపేటకు చేరుకున్నారు. మార్గమధ్యలో తిరిగి కారుకు మహారాష్ట్ర నంబర్ ప్లేట్ మార్చుకుని చౌటుప్పల్ మీదుగా ఇబ్రహీంపట్నం వస్తుండగా రాయపోల్ వద్ద వీరిని మంగళారం పోలీసులు పట్టుకున్నారు. కాగా నిందితులు ఇద్దరిపై కేసు నమోదు చేసి మంగళవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. గంజాయి సరఫరాదారుడైన మరో నిందితుడు తిరుపతి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు పీపీగా సుధాకర్‌రెడ్డి



వికారాబాద్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సుధాకర్‌రెడ్డిని నియమిస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. కొడంగల్‌కు చెందిన సుధాకర్‌రెడ్డి స్థానిక కోర్టులోనే కాకుండా ఇతర కోర్టుల్లోనూ న్యాయవాదిగా పనిచేస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ కార్యాలయంలో డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు పీపీగా సుధాకర్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తారు. గురువారం వికారాబాద్ జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆయన బాధ్యతలు చేపడతారు.



హాస్టల్‌లో వంటకాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

హాస్టల్ విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

యాచారం, ఆగస్టు 27: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న బీసీ గురుకుల హాస్టల్‌ను మంగళవారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు హాస్టల్‌ను తనిఖీ చేసి విద్యార్థులకు సమస్యలేమైనా ఉన్నాయా? అని తెలుసుకున్నానని ఎంపీడీవో చెప్పారు. హాస్టల్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. రోగాలన్నీ అపరిశుభ్రత వల్లే వస్తాయన్నారు. విద్యార్థులు చేతులు కడుక్కునేందుకు ట్యాప్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తమ సొంత పిల్లల్లాగే విద్యార్థులను చూసుకోవాలని సూచించారు. ట్యాంకును వారవారం శుభ్రం చేయించాలన్నారు. మెనూ ప్రకారంగా భోజనం వడ్డించాలని, పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు వడ్డించాలని ఆదేశించారు. హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు గుర్తించారు. వారికి వైద్యం చేయించాలని హాస్టల్ వెల్ఫేర్ అధికారిని ఆదేశించారు. తాను మళ్లీ తనిఖీకి వచ్చేలోగా ఏ సమస్యా లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులతో కలిసి ఎంపీడీవో భోజనం చేశారు. కూరగాయల భోజనం బాగుందన్నారు.

యువకుడికి సీఎం అభినందన

● సివిల్స్ ప్రిలిమ్స్‌లో సత్తాచాటిన జయకృష్ణ



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి అభయ హస్తం చెక్కు అందుకుంటున్న జయకృష్ణ

మహేశ్వరం, ఆగస్టు 27: కృషి, పట్టుదలుంటే అనుకున్నది సాధించొచ్చని నిరూపించాడు పేద కుటంబానికి చెందిన యువకుడు. మహేశ్వరం మండలం తుమ్మలూరుకు చెందిన గడ్డమీది యాదయ్య కుమారుడు జయకృష్ణ ప్రభుత్వ స్కూళ్లలో చదివి యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షలో ఉత్తమ ర్యాంక్ సాధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి అభినందనలు అందుకున్నాడు. సోమవారం సాయంత్రం హైదరాబాదులో రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం ద్వారా లక్ష రూపాయల చెక్కును అందుకున్నాడు. జయకృష్ణను తుమ్మలూరు వాసులు అభినందించా రు. ఐఏఎస్ సాధనే లక్ష్యం అన్న జయకృష్ణ మాట్లాడుతూ.. ఉన్నత విద్య అభ్యసన, ఉద్యోగాల సాధనకు కృషి పట్టుదల ముఖ్యం అని, ఇందుకు పేదరికమేమీ అడ్డు కాదన్నారు. ఐఏఎస్ కావాలన్న తపనతోనే చదువుతున్నానని చెప్పాడు. జయకృష్ణను సన్మానించిన వారిలో గ్రామ యువకులు యాదగిరి, శ్రీశైలం, లింగారెడ్డి, చోటూ, కార్తీక్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

మహిళకు డెంగీ

పెద్దేముల్, ఆగస్టు 27: పెద్దేముల్ మండలం ఇందూరులో ఓ మహిళ డెంగీ జ్వరంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఇందూరుకు చెందిన నర్సింహులు తన కూతురు జ్యోతిని కర్ణాటకలోని చాంగ్లేరు వ్యక్తికిచ్చి పెళ్లి చేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా జ్యోతి సోదరుడికి రాఖీ కట్టేందుకు తల్లిగారింటికొచ్చింది. రెండు రోజులకు జ్వరం రావడంతో ప్రైవేట్ వైద్యుడి వద్ద చికిత్స చేయించారు. జ్వరం తగ్గకపోవడంతో వైద్య పరీక్షలు చేయగా డెంగీ సోకినట్లు నిర్ధారణైంది. చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్యంగా నిలకడగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు.



ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో అనురాధ

చెట్లను నరికితే చర్యలు

నవాబుపేట, ఆగస్టు 27: ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో చెట్లను నరికిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో అనురాధ అన్నారు. 'హరితహారం మొక్కలపై గొడ్డలి వేటు' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం మైతాప్‌ఖాన్‌గూడను ఎంపీడీవో సందర్శించారు. ఆమె మాట్లాడుతూ విద్యుత్ శాఖ లైన్‌మన్ శంకర్ ఇష్టానుసారం చెట్లను నరకడం ఏమిటని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఏఈ ప్రమోద్, లైన్‌మన్ యాదగిరి, పంచాయతీ కార్యదర్శి నితిన్‌లు ఎంపీడీవోకు వివరణిచ్చారు.

జానపద కళలను కాపాడుకుందాం

కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య


విలేకరులతో మాట్లాడుతున్న జానపద కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణయ్య

బొంరాస్‌పేట్, ఆగస్టు 27: రాష్ట్రంలో ఉన్న జానపద కళలను కాపాడుకుంటూ ముందు తరాలకు వారధిగా ఉందామని తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణయ్య పిలుపునిచ్చారు. మంగళవారం బొంరాస్‌పేట్‌లోని జహంగీర్ పీర్ దర్గా వద్ద విలేకరులతో మాట్లాడారు. డప్పు, ఒగ్గుడోలు, భైండ్ల జామడికె, బుడగజంగాలు, తోలుబొమ్మలు, యక్షగానాలు, వీధి నాటకాలు ఇలా తెలంగాణ ప్రాంతంలో ఎన్నో జానపద కళలు ప్రజలకు ఆహ్లాదం, ఆనందం కలిగిస్తాయన్నారు. ఈ నెల 29న కోస్గిలోని ఏబీకే ఫంక్షన్ హాల్లో జానపద జాతర కార్యక్రమాన్ని తాలూకా జానపద కళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి కొడంగల్ నియోజకవర్గంలోని కళాకారులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమానికి కళాకారుల సంఘం రాష్ట్ర నాయకులు వంగ శ్రీనివాస్‌గౌడ్, లింగయ్య, హరికృష్ణ, రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో డప్పు కళాకారులు సాయిలు, కేశవులు, శకనప్ప, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌ను సందర్శించిన ట్రైనీ కలెక్టర్


వికారాబాద్ మార్కెట్‌ను సందర్శిస్తున్న ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి

వికారాబాద్, ఆగస్టు 27 : రైతు బజారులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ స్పీకర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో మంగళవారం ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి రైతు బజారు, కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. అక్కడి పరిస్థితులను వ్యాపారులను, రైతులను అడిగి తెలుసుకున్నారు. వర్షం పడే సమయాల్లో రైతు బజారులో కలుగుతున్న ఇబ్బందులు, సౌకర్యాలు, రోడ్లపై కూర్చునే తీరును రైతులు వివరించారు. ట్రైనీ కలెక్టర్ వెంట మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల, కమిషనర్ జకీర్ అహ్మద్, కౌన్సిలర్ శ్రీదేవి, నాయకులు సదానందరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసు, ఇంజినీర్ శ్రీనివాస్, మునిసిపల్ సిబ్బంది ఉన్నారు.

తోడికోడళ్ల కృషి

- డబిల్‌పూర్‌లో ఐదు నూతన తరగతి గదులు
- రూ.కోటితో నిర్మించనున్న స్వచ్ఛంద సంస్థ
- నేడు పనులను ప్రారంభించనున్న 'ఒసాట్' ప్రతినిధులు


డబిల్‌పూర్ పాఠశాల



మాజీ ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, మాజీ సర్పంచ్ గీత

మేడ్చల్ టౌన్, ఆగస్టు 27: తమ సొంతూరుపై అభిమానాన్ని చాటుకున్నారు ఆ తోడి కోడళ్లు. మొన్నటి వరకు ఒకరు ఎంపీపీగా, మరొకరు సర్పంచ్‌గా పనిచేశారు. రాజకీయ పలుకుబడితో గ్రామ పాఠశాలకు రూ.కోటి వెచ్చించి ఐదు తరగతి గదులను నిర్మించేందుకు ఓ స్వచ్ఛంద సంస్థను ఒప్పించారు. వివరాల్లోకి వెళ్తే.. మేడ్చల్ మండలం డబిల్‌పూర్ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల కొరత ఉంది. మాజీ ఎంపీపీ రజిత, మాజీ సర్పంచ్ గీత పాఠశాల గదుల నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఐల అంతర్జాతీయ సంస్థ ఒసాట్(వన్ స్కూల్ ఎట్ ఎ టైమ్)కు గత జనవరిలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. రజిత, గీతలు తమ ప్రయత్నంతో ఆ సంస్థను ఒప్పించారు. ఒసాట్ సంస్థ రూ.కోటి నిధులతో జడ్పీ పాఠశాలకు ఐదు క్లాస్‌రూమ్‌లను నిర్మించనుంది. బుధవారం(నేడు) సంస్థప్రతినిధులు గ్రామానికొచ్చి పనులను ప్రారంభిస్తారు. తరగతి గదులను నిర్మించే బాధ్యతను ఒసాట్ సంస్థలో సభ్యత్వం ఉన్న సైన్‌కార్న్ సాఫ్ట్‌వేర్ ఇండియా చేపట్టనున్నారు. బెంగళూరు సంస్థ ప్రతినిధి నిర్మలాజైపుల్లూర్ పనులను ప్రారంభిస్తున్నారు. తమ గ్రామానికి ఎన్‌ఆర్‌ఐల సంస్థ ఒసాట్ ఆర్థికసాయం అందజేయడం గొప్ప విషయం అని రజితరాజమల్లారెడ్డి, గీతాభాగ్యరెడ్డిలు సంతోషం వ్యక్తం చేశారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా

శామీర్‌పేట, ఆగస్టు 27: తూంకుంట మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి మెజారిటీ సభ్యులు హాజరుకాక మీటింగ్‌ను వాయిదా వేస్తున్నట్టు చైర్మన్ ప్రకటించారు. మంగళవారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటగోపాల్ సమావేశాన్ని తలపెట్టారు. కోరం సభ్యులు హాజరు కాలేదని చైర్మన్ కారంగుల రాజేశ్వర్‌రావు సమావేశాన్ని వాయిదా వేసినట్లు ప్రకటించారు. సమావేశం నిర్వహించకముందే చైర్మన్ కొందరు సభ్యులతో సంతకాలు చేయించి సమావేశాన్ని వాయిదా వేయడం సరికాదని నాలుగో వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మరో కౌన్సిలర్ రజనీవేణుగోపాల్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించక ముందే సభ్యులతో చైర్మన్ సంతకాలెలా చేయిస్తారని ప్రశ్నించారు. మున్సిపల్ చైర్మన్ ఇలాంటి అక్రమాలు, అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

భూలక్ష్మి అమ్మవారి ఆలయంపై దాడి

- హిందూ సంఘాల ఆందోళన

సంతోష్‌నగర్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సంతోష్‌నగర్ పరిధి రక్షాపురం కాలనీలో గల భూలక్ష్మి ఆలయంపై సోమవారం రాత్రి కొందరు దుండగులు దాడికి పాల్పడ్డారు. ఆలయ తలుపులు బద్ధలు కొట్టి విగ్రహాలను ధ్వంసం చేశారు. స్థానికులు, భక్తులు, హిందూ సంఘాల ప్రతినిధులు, పెద్ద ఎత్తున ఆలయం వద్దకు తరలివచ్చి నిరసన చేపట్టారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. బీజేపీ నాయకులు చేరుకుని సంఘీభావం తెలిపారు. పోలీసు అధికారులు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర హామీతో సోమవారం అర్ధరాత్రి ఆందోళనకారులు శాంతించారు. మంగళవారం బీజేపీ నాయకురాలు మాధవీలత, పార్టీ కార్యకర్తలతో కలిసి ఆలయం వద్ద ధర్నా చేపట్టారు. పోలీసులు ఆలయ పరిసరాల్లోని దుకాణాలను మూసివేయించారు. మాధవీలత మాట్లాడుతూ.. గోకులాష్టమి రోజే ఇలాంటి సంఘటన జరగడం బాధాకరం అన్నారు. చంద్రాయణగుట్ట ఎమ్మెల్యే, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ వచ్చి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా విగ్రహాల ధ్వంసం కేసు నిందితులు పోలీసుల ఆదుపులో ఉన్నారని తెలిసి బీజేపీ, హిందూ సంఘాల నేతలు సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ ముట్టడికి యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకొని పంపించేశారు.

ప్రమాదకరంగా రోడ్లు

ఎక్కడికక్కడ గుంతలు ● వాహనదారుల ఇబ్బందులు


అంగడి చిట్టెంపల్లి-లాల్‌పహాడ్ రోడ్డులో దిగబడిన లారీ(ఫైల్)

పూడూరు, ఆగస్టు 27 : కొన్ని రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో పూడూరుతోపాటు మండల పరిధి గ్రామాల్లో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. భారీ గుంతలతో రోడ్లు వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. పూడూరు నుంచి మైసమ్మగడ్డ తండాకు వెళ్లే రోడ్డు, మేడికొండ వెళ్లే రోడ్డు, బిజాపూర్-సోమన్‌గుర్తి మన్నెగూడ-చెన్‌గోముల్ రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. బైక్‌లు, బస్సులు, లారీలు, ఆటోలు ఇలా ఏ వాహనం కూడా సురక్షితంగా గమ్యస్థానానికి చేరలేని పరిస్థితులేర్పడ్డాయి. రోడ్లన్నీ వర్షాలకు ధ్వంసమయ్యాయి. అలాగే సరుకు రవాణా ట్రక్కులు వంటి భారీ వాహనాల రాకపోకలతో గుంతలు రోజుకింత ఎక్కువవుతున్నాయి. ఏ ఒక్క రోడ్డు కూడా మరమ్మతులు చేయడం లేదని, కొత్త రోడ్లు వేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా వానకాలంలో వాహనదారులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావంటున్నారు. తండాలు, హైవేకు ఆనుకొని ఉన్న గ్రామాలు, పట్టణాలు ఇలా అన్ని చోట్లా రోడ్లు దెబ్బతిన్నాయి. చిట్టెంపల్లి-లాల్‌పహాడ్ రోడ్డు పనులు ప్రారంభించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. గుంతల రోడ్లతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు పక్కన ఓ హోటల్ యజమానే గుంతలను సూచిస్తూ బోర్డు ఏర్పాటు చేశాడు. కానీ అధికారులు మాత్రం గుంతల రోడ్లకు మర్మతులు చేయించడం లేదని వాహనదారులు, ప్రజలు అంటున్నారు.


గుంతలమయంగా వికారాబాద్-హైదరాబాద్ రోడ్డు

ఐదేళ్లుగా కంకరతేలిన రోడ్డుపైనే ప్రయాణం



అంగడి చిట్టెంపలల్లి గేట్ నుంచి కంకల్ మీదుగా లాల్‌పహాడ్ వెళ్లే రోడ్డు ఐదారేళ్ల నుంచే కంకరతేలింది. ద్విచక్రవాహనదారులు రోజూ ఒక్కరైనా ప్రమాదం బారిన పడుతున్నారు. కంకరతేలిన రోడ్లపై వాహనాలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. పంక్చర్లు అవుతున్నాయి. ప్రభుత్వం వెంటనే ఈ రోడ్డును బాగుచేయాలి. - **రాజు, చెన్‌గోముల్**


చేవెళ్లలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిరాం


ఆలయ పుష్కరిణిని పరిశీలిస్తున్న అధికారులు

వినాయక మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదు

చేవెళ్ల, ఆగస్టు 27: వినాయక ఉత్సవాలను ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, ఏసీపీ బంటు కిషన్ తెలిపారు. మంగళవారం చేవెళ్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పోలీసుల ఆధ్వర్యంలో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బంది కలగకుండా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించుకోవాలన్నారు. మండపాలకు పోలీసు శాఖ అనుమతులు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద మద్యం, ఇతర ఎలాంటి మత్తుపదార్థాలు వినియోగించొద్దన్నారు. డీజేలు, లౌడ్ స్పీకర్లకు అనుమతి లేదన్నారు. అనంతరం లక్ష్మీవేంకటేశ్వర ఆలయ పుష్కరిణిని గణేశ్ నిమజ్జనాల కోసం అధికారులు పరిశీలించారు. సమావేశంలో తహసీల్దార్ కృష్ణయ్య, సీఐలు భూపాల్‌శ్రీధర్, వెంకటేశం, ఎంపీడీవో హిమబిందు, ఎంపీవో విఠలేశ్వర్, ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెరువును పరిశీలించిన అధికారులు


చెరువును పరిశీలిస్తున్న డీసీపీ రాజేష్, కమిషనర్ సుమన్‌రావు

శంషాబాద్, ఆగస్టు 27: వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసే కాముని చెరువును మంగళవారం శంషాబాద్ డీసీపీ రాజేష్, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. వినాయక విగ్రహాలను ఏ రూట్లో తీసుకురావాలి, వాహనాలను ఎక్కడ పార్క్ చేయాలి, ఎక్కడెక్కడ లైట్లు వేయాలి, నిమజ్జనోత్సవాలకు వచ్చే వారికి తాగునీరు, శానిటేషన్ వంటి సదుపాయాలు ఎలా కల్పించాలనే వాటిపై చర్చించి పరిశీలించారు. నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా జరిపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసి పరిశీలించనున్నట్టు కమిషనర్ చెప్పారు.

ఫలించిన ఎమ్మెల్యే ప్రయత్నం

- పరిహారమందని రైతులకు భరోసా
- గ్రామస్తులతో రెవెన్యూ అధికారుల సమావేశం


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటమాధవరావు

కొత్తూర్, ఆగస్టు 27 : మండల పరిధి సిద్ధాపూర్‌లోని అసైన్డ్ భూమి రైతులకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భరోసా కల్పించారు. గ్రామంలో 315ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో వందల మంది రైతులకు ప్రభుత్వం అసైన్ చేసింది. ఈ భూమిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం టీజీఐఐసీకి అప్పగించింది. రైతులకు కొంత పరిహారమిచ్చింది. పరిహారంలో అవతవకలు జరిగాయని, నిజమైన రైతులకు పరిహారమందలేదని, బీఆర్ఎస్ నాయకులు చెప్పిన పేర్లనే జాబితాల్లో నమోదు చేయించారని గ్రామస్తులు గతంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు తెలిపారు. విచారణ జరిపించాలని కోరారు. అసైన్డ్ భూమిలో గ్రామావసరాలకు 20ఎకరాలు కేటాయించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఇదే అంశాన్ని ఎమ్మెల్యే రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకపోయారు. మంత్రి స్పందిస్తూ ప్రజావసరాలకు 20ఎకరాల కేటాయించాలని, పరిహారం అందని రైతులకు పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో షాద్‌నగర్ ఆర్డీవో వెంకటమాధవరావు, కొత్తూరు తహసీల్దార్ రవీందర్‌రెడ్డి మంగళవారం సిద్ధాపూర్‌లో గ్రామస్తులతో సమావేశమయ్యారు. పరిహారమందని రైతుల నుంచి ధరఖాస్తులు తీసుకున్నారు. ఆర్డీవో మాట్లాడుతూ 278 సర్వే నంబర్లో ప్రజావసరాలకు 20ఎకరాలు కేటాయిస్తామన్నారు. పరిహారం రాని రైతులకు రెండు నెలల్లో అందేలా కృషిచేస్తామన్నారు. పరిహార అవకతవకలపై విచారణ చేస్తామని పేర్కొన్నారు. అవకతవకలకు పాల్పడ్డట్టు తేలితే చర్యలు తప్పవన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శేఖరెడ్డి మాట్లాడుతూ.. షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ కృషితోనే అవసరాలకు 20 ఎకరాలు కేటాయించారన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సహదేవ్‌రెడ్డి, సర్వేయర్ వెంకటేష్, నాయకులు జంగయ్య, పాషా, రాంచందర్, నుస్రత్‌బేగం, బాసు, జాఫర్, ఖాజా, మైసమయ్య, రామయ్య, కుమార్, తిరుపతిరెడ్డి, గోపాల్, వెంకటయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ బౌలర్‌గా తాజ్దార్

ఐదు వికెట్ల సాధన



మేడ్చల్ టౌన్, ఆగస్టు 27: రాష్ట్రస్థాయిలో జరిగిన ఏ-2 డివిజన్ రెండు రోజుల లీగ్ చాంపియన్‌షిప్ క్రికెట్ పోటీల్లో మేడ్చల్‌కు చెందిన విద్యార్థి షేక్ తాజ్దార్ బాలింగ్‌లో ప్రతిభ చూపి 5 వికెట్లు సాధించాడు. మంగళవారం ఘట్‌కేసర్‌లో ఏఎన్‌సీజీ-2 గ్రౌండ్‌లో నిర్వహించిన పోటీల్లో విజయనగర్ టీం తరపున ఆడి 9 ఓవర్లలో 32 పరుగులిచ్చి 5 వికెట్లు తీశాడు. బాలింగ్‌లో ప్రతిభ చూపిన తాజ్దార్‌ను కోచ్ మన్సూర్ అభినందించారు.

ప్రభుత్వంపై దుష్ప్రచారం తగదు

- హైడ్రా 111 జీవో పరిధికి రాదు
- 111 జీవో గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురికావొద్దు
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంజీవరెడ్డి



మొయినాబాద్ రూరల్, ఆగస్టు 27: కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు హైడ్రా విషయంలో దుష్ప్రచారం చేయడం తగదని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కీసరి సంజీవరెడ్డి అన్నారు. ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన హైడ్రా 111జీవో పరిధిలోకి రాదన్నారు. మంగళవారం ఆయన అజీజ్‌నగర్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లోని చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణాలనే హైడ్రా అధికారులు కూల్చివేస్తుందన్నారు. 111జీవో పరిధి అక్రమ నిర్మాణాలను కూడా హైడ్రా కూల్చి వేస్తుందని కొన్ని మీడియా సంస్థలు అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. 111జీవో పరిధి భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న సామాన్యులు భయాందోళన చెందుతున్నారని చెప్పారు. ఈ విషయంలో ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. దీనిపై ప్రజలు భయాందోళన చెందొద్దని చెప్పారు. హైడ్రా 111జీవో పరిధికి వెళ్లదని, దీంతో మాకు సంబంధమే లేదని హైడ్రా కమిటీ కమిషనర్ రంగనాథే ఇటీవల ఓ ప్రకటనలో తెలిపారని గుర్తుచేశారు. ఇటీవల రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారన్నారు. 111 జీవోపై కాంగ్రెస్ ప్రభుత్వానికి అవగాహన ఉందన్నారు. కొన్ని మీడియా సంస్థలు చేసే తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని తెలిపారు. హైడ్రా రాజకీయాలకు అతీతంగా పనిచేస్తోందన్నారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణలనే తొలగిస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ పరిరక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా కమిటీని వేసిందన్నారు. గండిపేట, హిమాయత్‌సాగర్ జలాశయాలకు రక్షణ కవచంగా పనిచేస్తుందన్నారు.

విలీన పంచాయతీలను పునరుద్ధరించాలి


కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న నాయకులు

వికారాబాద్, ఆగస్టు 27: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాటప్రకారం మున్సిపాలిటీలో కలిపిన ఆరు గ్రామాలను మున్సిపల్ నుంచి తొలగించి పంచాయతీలుగా పునరుద్ధరించాలని మద్గుల్ చిట్టెంపల్లి కౌన్సిలర్ గోపాల్ అన్నారు. మంగళవారం కలెక్టర్‌ను కలిసి విలీన గ్రామాలు మద్గుల్ చిట్టంపల్లి, గుడిపల్లి బూర్గుపల్లి, ధన్నారం, గిర్గెట్‌పల్లి, కొంపల్లిలను గ్రామ పంచాయతీలుగా పునరుద్ధరించాలని కోరారు. వ్యవసాయిక గ్రామాలను మున్సిపాలిటీలో కలిపారన్నారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఎన్నికల్లో పంచాయతీలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విలీన గ్రామాలను పంచాయతీలుగానే ఉంచేందుకు స్పీకర్ సుముఖంగా ఉన్నారన్నారు. కలెక్టర్‌ను కలిసిన గ్రామాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సంపూర్ణ మద్య నిషేధానికి గ్రామస్తుల తీర్మానం


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

వికారాబాద్, ఆగస్టు 27: తమ గ్రామంలో సంపూర్ణ మద్య నిషేధం విధించాలని వికారాబాద్ జిల్లా గోధుమగూడ గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం మాజీ సర్పంచ్ అనితసత్తయ్యగౌడ్, మాజీ ఉప సర్పంచ్ నర్సిములు, గ్రామస్తులు కలిసి అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు తీర్మానపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరికి మద్యపాన వ్యసనంతో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని, చిన్న వయసులోనే యువత పెడదారి పడుతోందని అన్నారు. ఇలాంటి వాటికి శాశ్వత పరిష్కారంగా గ్రామంలో మద్య నిషేధాన్ని అమలు చేయాలని తాము ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఇందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.


అనురాగ్ యూనివర్సిటీ వద్ద ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనురాగ్ యూనివర్సిటీ వద్ద ఆందోళన

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 27: చెరువు బఫర్ జోన్లలో కాలేజీలు కట్టి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న అనురాగ్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. బఫర్ జోన్‌లో భవనాలు కట్టి యూనివర్సిటీ పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్న అనురాగ్ వర్సిటీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్రమణల్లోని భవనాలను కూల్చితే విద్యార్థుల భవితవ్యం ఏమిటని ప్రశ్నించారు. పోలీసులు వచ్చి ధర్నా చేస్తున్న నాయకులను అక్కడి నుంచి పంపిచారు. కార్యక్రమంలో అన్వర్, వంశీవర్ధన్, అరుణ్, హరీష్, మహేష్, భానుప్రకాశ్, వినోద్, శివ తదితరులు పాల్గొన్నారు.

'ఇన్ఫోసిస్'లో వర్క్‌ఫ్రం హోంను ఎత్తేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న హాస్టల్స్ అసోసియేషన్ నిర్వాహకులు

ఘట్‌కేసర్, ఆగస్టు 27: పోచారం ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో వర్క్ ఫ్రం హోంను ఎత్తేసి కార్యాలయంలోనే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పోచారం ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్ డిమాండ్ చేసారు. మంగళవారం క్యాంపస్ వద్ద వర్క్ ఫ్రం హోం విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు, బ్యానర్లతో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కోసం 450 ఎకరాల భూమిని ఇన్ఫోసిస్ సంస్థకు ఇచ్చామని గుర్తుచేశారు. కరోనా వచ్చినప్పటి నుంచి వర్క్ ఫ్రం హోంనే అమలు చేస్తున్నారన్నారు. దీంతో అనేక రంగాల కార్మికులు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 10శాతం మంది ఉద్యోగులే కార్యాలయానికొచ్చి విధులు నిర్వహిస్తున్నారని, దీన్ని 100శాతానికి పెంచాలన్నారు. ఐటీ సంస్థలను నమ్ముకుని ఈ చుట్టుపక్కల, నగరంలో 40వేల హాస్టళ్లు ఉన్నాయన్నారు. ఇన్ఫోసిస్ సంస్థను నమ్ముకొని నిర్మించిన హాస్టళ్లలో ఉద్యోగులు ఎవరూ లేక నిర్వాహకులు నష్టాలపాలవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 'లుక్ ఈస్ట్' పాలసీలో భాగంగా మరిన్ని కంపెనీలను ఇక్కడికి తీసుకురావాలన్నారు. ఇన్ఫోసిస్ సంస్థలో ఎకరాలకొద్దీ ఖాళీ స్థలం ఉందన్నారు. ఇన్ఫోసిస్ ప్రతినిధులకు, కేంద్ర, రాష్ట్ర మంత్రులకు, అధికారులకు వినతిపత్రాలు ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, కరుణాకర్, మహీధర్, సుధీర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, రాంరెడ్డి, హాస్టల్స్ అసోసియేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

కార్మికులపై పనిభారం తగ్గించాలి


హకీంపేట ఆర్టీసీ డిపో వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు


ఇబ్రహీంపట్నం డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

శామీర్‌పేట/ఇబ్రహీంపట్నం, ఆగస్టు 27: కార్మికులపై రోజురోజుకూ పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించి అధికారుల వేధింపులను ఆపాలని ఆర్టీసీ కార్మికులు డిమాండ్ చేశారు. అపరిష్కృత సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. మంగళవారం హకీంపేట ఆర్టీసీ డిపో వద్ద జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళనచేశారు. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని, బాండ్ డబ్బులు ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆర్టీసీ జాయింట్ కమిటీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం డిపో వద్ద నల్ల కార్మికులు నిరసన తెలిపారు. పీఆర్సీ ప్రకారం వేతనాలివ్వాలని, ప్రయాణికులకు సంఖ్యకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు.



చేవెళ్లలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

శ్రీచైతన్య విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

చేవెళ్ల, ఆగస్టు 27 : గుర్తింపు లేని, నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న శ్రీచైతన్య విద్యా సంస్థలను రద్దు చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాల ఎదుట పీడీఎస్‌యూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల డివిజన్ ఉపాధ్యక్షుడు ప్రభాస్, కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యాసంస్థలు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ కనీస మౌలిక వసతులు కల్పించకుండా నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంస్థలను నడుపుతున్నారని వారు ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు ఆశోక్, మహేందర్, అశోక్, మురళి, అలీ, ఆజయ్, బబ్లు, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్ అందజేత

శంషాబాద్ రూరల్, ఆగస్టు 27: శంషాబాద్ మండలంలోని ఘాన్సీమియా గూడ, గండిగూడ, పాలమాకుల, పెద్దషాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సత్య సుందర హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గోపాల్‌సింగ్ కుమారుడు సాహిల్‌సింగ్ ఆధ్వర్యంలో మంగళవారం బ్యాగులు, నోటు బుక్‌లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. దాదాపు వేయి మంది పేద విద్యార్థులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సాహిల్‌సింగ్‌ను శాలువాలతో సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కోటేశ్‌గౌడ్, షాపూర్ మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ కృష్ణ, ఉప సర్పంచ్‌లు మల్లేశ్, ఇమ్రాన్, మాజీ వార్డుసభ్యులు కిట్టు, రవి, శ్రీను, గ్రామస్థులు, నాయకులు జంగయ్య, బాబు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

కేశంపేట, ఆగస్టు 27: మండల కేంద్రంలోని వాగు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కేశంపేట గ్రామస్తులు మంగళవారం డీటీ గీతకు వినతి పత్రం అందించారు. వాగు సమీపంలోని సర్వే నెంబర్ 70లో ప్రభుత్వ భూమి ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన కొందరు ప్రభుత్వ భూమిలో కడిరాళ్లు పాతుతున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో కృష్ణారెడ్డి, రమణారెడ్డి, కేవీరెడ్డి, రంగారెడ్డి, వెంకటయ్య, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



డీటీకి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

అందరికీ రుణమాఫీ చేస్తాం

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, ఆగస్టు 27: రుణమాఫీ కాని రైతులు అధైర్య పడొద్దు.. అందరికీ రుణమాఫీ చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని తిమ్మాపూర్ వద్ద గల రైతువేదిక వద్ద మంగళవారం రుణమాఫీ కాని రైతులకు వ్యవసాయ శాఖ సమావేశం నిర్వహించగా, ఎమ్మెల్యే శంకర్ హాజరై మాట్లాడారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదన్న విషయం వాస్తవమేనని, లోన్లు మాఫీ కాని రైతుల కోసం వ్యవసాయ శాఖ ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. రుణమాఫీకి అర్హులైన రైతులు పూర్తి వివరాలను వ్యవసాయ శాఖ అధికారులకు అందించి తప్పొప్పులను సరిచేసుకోవాలన్నారు. ప్రతిపక్షాలు పనికట్టుకుని రైతులను తప్పుదోవ పట్టించేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, వారి మాటలను తిప్పికొట్టాలని సూచించారు. వ్యవసాయాశాఖ ఏడీఏ రాజారత్నం మాట్లాడుతూ రుణమాఫీ కాని రైతుల వివరాల కోసం ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నామని, త్వరలో అందరికీ మాఫీ చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయాధికారి గోపాల్, విస్తరణాధికారులు దీపిక, నిఖిత, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు జె.సుదర్శన్‌గౌడ్, జెనిగె జగన్, బాల్‌శౌవ్‌రెడ్డి, రాయప్‌రెడ్డి, సాయిలు, ఏనుగు జనార్ధన్‌రెడ్డి, కర్రోళ్ల సురేందర్, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



కొత్తూర్ : రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

దశలవారీగా సమస్యల పరిష్కారం

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. పట్టణంలోని 2, 16, 18 వార్డుల్లో మంగళవారం పర్యటించి, ఆయా కాలనీవాసులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కాలనీల సమస్యలను తెలుసుకుని, ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికే వార్డుల వారీగా సమావేశాలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రోడ్డు, డ్రైనేజ్, విద్యుత్తు సమస్యలను పరిష్కరిస్తూ, అర్హత కల్గిన పేదలకు పారదర్శకంగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను కేటాయిస్తామని తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి పరుస్తానని ఎమ్మెల్యే శంకర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబర్‌ఖాన్, జి. బాల్‌రాజ్‌గౌడ్, కొంకళ్ళ చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, వన్నాడ ప్రకాష్‌గౌడ్, కందివనం సూర్యప్రకాష్, అగ్గనూరి బస్వం, బచ్చలి నరేష్, ఖదీర్, కాలనీల వాసులు పాల్గొన్నారు.

మెకానిక్ కుటుంబానికి ఆర్థిక సహాయం

షాద్‌నగర్ పట్టణంలోని ఖాజీపుర కాలనీకి చెందిన అన్వర్ కుటుంబానికి ఎమ్మెల్యే శంకర్ రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన మెకానిక్ అన్వర్‌కు భార్య, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. అన్వర్ మరణంతో అతని కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నదని తెలుసుకున్న ఎమ్మెల్యే, మెకానిక్ అసోసియేషన్ సభ్యులను పిలిచి ఆర్థిక సాయం అందజేశారు. అన్వర్ కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కూడా ఇస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లారీ మెకానిక్ అసోసియేషన్ నాయకులు వెంకటేష్, జాఫర్, షకీర్, సలీం, బాబు, లక్ష్మణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



షాబాద్ : కృష్ణుడు, రాధ వేషధారణలో విద్యార్థులు



శంషాబాద్ : డోలారోహణంలో పాల్గొన్న భక్తులు

కడ్తాల్, ఆగస్టు 27: మండలంలోని బాలాజీనగర్ తండా సమీపంలోని ధనరాశి పర్వతంపై గల శ్రీ రాధాకృష్ణ ఆలయంలో మంగళవారం శ్రీ కృష్ణజన్మాష్టమి వేడుకలు అత్యంత వైభంగా నిర్వహించారు. మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా దేవాలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయామనంగా అలంకరించారు. ధర్మకర్త రామావత్ బీచ్యనాయక్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు కొనసాగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేడులకు భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాయంత్రం ఆలయం ఆవరణలో ఉట్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు చిన్నారులు గోపిక, కృష్ణుడి వేషధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కమ్లీబీచ్యనాయక్, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ లచ్చిరామ్ నాయక్, నాయకులు జైపాల్‌రెడ్డి, పర్వతాలు, రాంచందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ : మున్సిపల్ కేంద్రంలోని శ్రీ కృష్ణ మందిరం ఆలయంలో డోలారోహణం (తొట్టెల ఉత్సవం) కనులపండువగా నిర్వహించారు. భక్తులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టి ప్రతి భక్తుడికి చక్కెర, అటుకులు, సొంటి, గసాలతో తయారు చేసిన ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణతో ఆకట్టుకున్నారు.



కడ్తాల్ : ఉట్టి కొడుతున్న చిన్నారులు

షాబాద్ : మండల పరిధిలోని నాగర్‌గూడలో శ్రీ చైతన్య హై స్కూల్‌లో మంగళవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. చిన్నారులు శ్రీ కృష్ణులు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, నాగర్‌గూడలో శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టడానికి విద్యార్థులు పోటీలు పడ్డారు. పాఠశాల కరస్పాండెంట్ సిద్దాపురం ప్రసాద్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. విద్యార్థులకు చిన్నప్పటి నుంచే సాంప్రదాయాలను నేర్పించాలన్నారు. పండుగల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, ఉపాధ్యాయులు ప్రవళిక, సునీత, లిఖిత, సంభవి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మోటార్ సైకిళ్ల దొంగలు అరెస్ట్

● ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 27: ఇళ్లు, బస్టాండ్, వైన్ షాప్‌ల ముందు నిలిపిన మోటార్ సైకిళ్లే టార్గెట్‌గా దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని మంగళవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన సూరమోని శ్రీశైలం, ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామానికి చెందిన భీక్యా రాజులు ద్విచక్రవాహనాలు దొంగిలించి అమ్ముకునేవారని తెలిపారు. వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారని, పలు చోట్ల ఐదు బైక్‌లు చోరీ చేశారని తెలిపారు. ఈ నెల 21న పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన ముడావత్ కల్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు. విచారణలో చోరీకి పాల్పడినట్ల తేలడంతో ఇద్దరికి అరెస్ట్ చేసి, వారి నుంచి ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

నాలుగు నెలల పాపతో మహిళ అదృశ్యం

యాచారం, ఆగస్టు 27 : హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొట్టిలగడ్డ తండాకు చెందిన ఓ వివాహిత, తన నాలుగేళ్ల పాపతో సోమవారం అదృశ్యమైంది. పోలీసుల కథనం మేరకు గొట్టిలగడ్డ తండాకు చెందిన రాజు భార్య అఖిల, తన చిన్నారితో పాటు సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. దాంతో భర్త అత్తవారింట్లో, చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. మంగళవారం రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు.. ఆరుగురికి మూడేళ్ల జైలు

శంకర్‌పల్లి, ఆగస్టు 27: హత్యకేసులో ఏడుగురు నిందితులకు రంగారెడ్డి జిల్లా కోర్టు మంగళవారం జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. 2013 అక్టోబరు 15న కాకర్ల గుట్ట తండాకు చెందిన గోపాల్.. అతడి కూతురు, అల్లుడు కుటుంబ విషయంలో గొడవ పడుతుండగా సముదాయించాడు. ఈక్రమంలో గోపాల్ అల్లుడి కుటుంబికులు కోపంతో రాడ్డు తీసుకుని గోపాల్ ఛాతీపై కొట్టారు. తీవ్రగాయాలైన గోపాల్‌ను చెవేళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరిశీలించి అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు. గోపాల్‌ను గాయపరిచి మృతికి కారకులైన వర్త్య కాల్యాకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.5వేల జరిమానా, పత్‌లావత్ హన్యా, పత్‌లావత్ శ్రీను, పత్‌లావత్ ఫున్యా, పత్‌లావత్ వస్యా, వర్త్య లలిత, వర్త్య పెంటమ్మలకు మూడేళ్ల జైలు శిక్షను న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మొయినాబాద్, ఆగస్టు 27 : అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి మనస్తాపానికి గురై ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలోని చిలుకూరులో మంగళవారం జరిగింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం .. మండల పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన ఎస్. కుమార్(42) చిలుకూరు మృగవని పార్కులో రోజువారీ కూలీగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల అతడి ఆరోగ్యం క్షీణించింది. దాంతో కుమార్ మంగళవారం తెల్లవారుజామున పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అడుగా వెళ్లిన వారు గమనించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కడ్తాల మండల కేంద్రంలో కూలీ..

కడ్తాల, ఆగస్టు 27 : మండల కేంద్రంలో ఓ కూలీ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ గ్రామానికి చెందిన కుక్కల నర్సింహ, భార్య సుమిత్రతో కలిసి బతుకుదెరువు కోసం రెండేళ్ల క్రితం కడ్తాల మండల కేంద్రంలో ఉంటున్నాడు. కూలీనాలీ చేసుకుంటూ కాలం జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో నర్సింహ కోషిక వెంకటేష్ అనే వ్యక్తి ఆవులషెడ్‌లో పనికి కుదిరాడు. సోమవారం సాయంత్రం తన భార్యతో గొడవపడిన నర్సింహ షెడ్డు వద్దకు వెళ్లి రాడ్డుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బావమరిది నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు

కడ్తాల్, ఆగస్టు 27: మండల కేంద్రంలో మంగళవారం రేణుకా ఎల్లమ్మ బోనాలు భక్తులు వైభవంగా జరుపుకున్నారు. ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సత్యం యాదవ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. నాయకులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం మహిళలు బోనం కుండలను అలంకరించుకొని ర్యాలీగా అమ్మవారి ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, మహిళల పూనకాలు, యువతీ యువలకు కేరింతలు, డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, లక్ష్మీనర్సింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు గూడూరు భాస్కర్ రెడ్డి, హన్మనాయక్, ముత్తి కృష్ణ, జహంగీర్‌బాబా,జహంగీర్‌అలీ, మాలే మల్లేశ్‌గౌడ్, ఎర్రోళ్ల రాఘవేందర్, రాంచందర్‌నాయక్, లక్ష్మయ్య, రాములు, కృష్ణయ్య, యాదయ్య, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కడ్తాల్ మండల పరిధిలోని అన్మాస్‌పల్లిలో మంగళవారం సాయంత్రం బోనాల వేడుకలు అంబరాన్నంటాయి. తెలంగాణ సంస్కృతిని చాటేలా మాజీ సర్పంచ్ శంకర్ ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, యువతీయువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కడ్తాలలో బోనాల ర్యాలీ..

అట్టహాసంగా జోనల్ స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నీ ప్రారంభోత్సవంలో సీఐ శివప్రసాద్

కడ్తాల్, ఆగస్టు 27: జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు కడ్తాల మండల కేంద్రం సమీపంలోని బటర్‌ఫ్లై సిటీలో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 16 జట్లకు గాను 200 మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. బటర్‌ఫ్లై సిటీ స్కూల్ ప్రిన్సిపాల్ సంజీవ్ నాంపల్లి, జోనల్ క్రీడా కార్యదర్శి భీముడు లతో కలిసి కడ్తాల సీఐ శివప్రసాద్ ప్రారంభించారు. నేడు(బుధవారం) ఫైనల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని భీముడు తెలిపారు. పీడీ, పీఈటీలు హమ్మద్ సాబేర్, జ్యోతి, పాండు, ప్రసాద్, రామకృష్ణ, రామచందర్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలి

చేవెళ్ల, ఆగస్టు 27 : మధ్యాహ్న భోజనం పథకానికి నిధులు పెంచాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రణయ్, శంకర్ తెలిపారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణకు ప్రభుత్వం నిధులు పెంచాలని, దాని నిర్వహణా బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వటం మానేయాలన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్మికులను రోడ్డుపాలు చేయడమేనన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.26వేల కనీస వేతనం ఇవ్వాలన్నారు. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్, స్టాలిన్, వంశీ, అరుణ్, శ్రీనివాస్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రణయ్

సమాజ సేవకు పునరంకితం కావాలి

కడ్తాల్, ఆగస్టు 27: పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు సమాజ సేవకు పునరంకితం కావాలని గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరుశ్రీనివాస్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించి పదవీ విరమణ పొందుతున్న గూడూరు రవీందర్‌రెడ్డికి హన్మనాయక్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మాన అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు.



రవీందర్‌రెడ్డి-అరుణ దంపతులను సన్మానిస్తున్న నాయకులు, తదితరులు

తుక్కుగూడ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

మహేశ్వరం, ఆగస్టు 27 : మున్సిపాలిటీని అభివృద్ధిలో మరింత పరుగులు పెట్టిస్తామని తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలో రూ. 6లక్షల నిధులతో చేపట్టే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన భూమిపూజ చేశారు. హైదరాబాద్‌కు ఆనుకొని ఉన్న తుక్కుగూడ మున్సిపాలిటీ ఏర్పాటు తొలి రోజుల్లో అభివృద్ధిలో వెనకబడి ఉండిందని, మున్సిపల్ ప్రజలకు మౌలిక వసతులు కల్పించకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన అన్నారు. నాలుగున్నరేళ్లుగా రాజకీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ప్రజలకు అన్నిరకాల వసతులు, సౌకర్యాలు కల్పిస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. పాలకవర్గం పదవీకాలం ముగిసేనాటికి మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, విలాస్, రాజు, శివకుమాంర్, మౌనిక రాజు తదితరులు పాల్గొన్నారు.



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు భూమి పూజ చేస్తున్న చైర్మన్ మధుమోహన్

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

ఆమనగల్లు, ఆగస్టు 27: మండల పరిధిలోని మేడిగడ్డ తండాలో విద్యుత్ సమస్యను పరిష్కరించి ప్రజల, రైతుల ఇబ్బందులు తీర్చాలని గిరిజన సేవా సంఘం రాష్ట్ర నాయకుడు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు రవీందర్ నాయక్ కోరారు. మూడు రోజులుగా తండాలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోకపోతే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. మేడిగడ్డ తండాలో మంగళవారం రవీందర్‌నాయక్ స్థానికులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ తండాలో విద్యుత్ సమస్యను పరిష్కరించకపోతే ఆమనగల్లు ఏడీఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, ప్రత్యేక ఫీడర్ ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరారు. శంకర్‌నాయక్, సేవ్యానాయక్, రమేశ్‌నాయక్, కృష్ణనాయక్, రాథోడ్, హరిలాల్, రమేశ్, జయరామ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలకు సమన్వయంతో పనిచేయాలి

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 27: గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకునేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని శంషాబాద్ డీసీపీ రాజేష్ సూచించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో మంగళవారం షాద్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వినాయకుల నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేసి ఇబ్బందులు కలుగకుండా, చెరువుల వద్ద ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు పాటించాలని, మండపాల వద్ద జాగ్రత్తలపై నిర్వాహకులకు చెప్పాలని తెలిపారు. ఆర్డీవో కార్యాలయం ఏవో జ్యోతి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఫైర్ ఆఫీసర్ జగన్, అన్ని శాఖల అధికారులున్నారు.

డీజేలకు అనుమతి లేదు

కడ్తాల : గణేశ్ నవరాత్రోత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలని సీఐ శివప్రసాద్ సూచించారు. వినాయక నవరాత్రోత్సవాల నిర్వహణపై గణేశ్ ఉత్సవ కమిటీలతో శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీలు నిబంధనలకు లోబడి వేడుకలు జరుపుకోవాలని, మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదన్నారు. రోడ్లకు అడ్డంగా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ వెంకటేష్, మాజీ ఎంపీటీసీ జి.లక్ష్మయ్య, తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

తలకొండపల్లి : చౌదర్‌పల్లిలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్ ఆధ్వర్యంలో కామినేని ఆసుపత్రి సహకారంతో వైద్యశిబిరం నిర్వహించారు. మాజీసర్పంచ్ చంద్రయ్య, ఎంపీటీసీ పెంటమ్మ, డీసీసీబీ ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డిలు శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ అఖిల ఆధ్వర్యంలో 216 మందికి పరీక్షలు నిర్వహించి మందులందించారు.

షాబాద్ : సీజనల్ వ్యాధులు, కురుస్తున్న వర్షాలకు హాస్టల్ విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో అపర్ణ అన్నారు. హైతాబాద్, షాబాద్‌లోని హాస్టళ్లను సందర్శించి వాటర్ ట్యాంకు, హాస్టల్ పరిసరాలు, కిచెన్‌షెడ్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు.

తలకొండపల్లి : ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక బీఆర్ఎస్ నాయకులు అతన్య ప్రచారాలకు ఒడిగట్టారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం కాంగ్రెస్ ప్రజారంజక పాలన చూసి ఓర్వలేక విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు మాట్లాడారు. ప్రజాభిమానంతో కసిరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికై నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు.

బీసీ మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య

ఆమనగల్లు, ఆగస్టు 27: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంగళవారం కల్వకుర్తి బీసీ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కల్వకుర్తిలో సెప్టెంబర్ 2న నిర్వహించే బీసీ మహాధర్నాకు సంబంధించి రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను మంగళవారం బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్, బీసీ సంఘం నాయకులతో కలిసి కృష్ణయ్య ఆవిష్కరించారు. కొమ్ము మాట్లాడుతూ కల్వకుర్తిలో నిర్వహించే మహాధర్నాకు బీసీ సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. బీసీ సంఘం నాయకులు రాజరామ్ యాదవ్, మేకల కృష్ణ, అనిల్, మహేశ్, గణేశ్, సాయి తదితరులున్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు



శంషాబాద్/షాద్‌నగర్ అర్బన్ : సంబరాల్లో నాయకులు

శంషాబాద్/షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 27 : ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో ఎమ్మెల్సీ కవితకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం సాయంత్రం శంషాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా పేల్చారు. బీఆర్ఎస్, కవిత, కేసీఆర్, కేటీఆర్‌లకు అనుకూలంగా నినాదాలు చేసి మిఠాయిలు పంచిపెట్టారు. బీఆర్ఎస్ షాద్‌నగర్ పట్టణశాఖ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజ్ నేతృత్వంలో స్థానిక చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, బాణసంచాలను కాల్చారు. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని నినాదాలు చేశారు. బీజేపీ కక్షపూరితంగా కవితపై అక్రమ కేసు పెట్టి, ఇన్నాళ్ళు బెయిల్ రాకుండా చేసిందని ఆరోపించారు. కవిత నిర్దోషిగా బయటపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు.

మైసమ్మ ఉత్సవాల నిర్వహణకు దాతల విరాళం

కేశంపేట, ఆగస్టు 27: మండల కేంద్రంలోని చర్ల మైసమ్మ ఉత్సవాల నిర్వహణకు దాతలు విరాళం అందించారు. కేశంపేట మాజీ జడ్పీటీసీ విశాలశ్రావణ్‌రెడ్డి రూ.10,116, నగరానికి చెందిన వ్యాపారవేత్త కందికంటి రాజుగౌడ్ రూ.10,000 విరాళం ఇచ్చారు. కేశంపేట గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ రమణగౌడ్ మంగళవారం ఉత్సవ కమిటీ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో భైకని శేఖర్ యాదవ్, పాండు గౌడ్, పవన్ కుమార్ రెడ్డి, హరికృష్ణ, నక్క శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలి హత్య నిందితులను కఠినంగా శిక్షించాలి

మహేశ్వరం, ఆగస్టు 27 : కోల్‌కతాలో వైద్యురాలిపై లైంగికదాడికి పాల్పడి హత్యకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని అవేర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ హన్మంత్‌రావు అన్నారు. ఈమేరకు మంగళవారం కళాశాలతో పాటు అవేర్ మాధవన్‌జీ హాస్పిటల్ సిబ్బంది ఆధ్వర్యంలో తుక్కుగూడలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వైద్యురాలిపై లైంగికదాడి క్షమించరాని నేరమని ఆ ఘటనకు సంబంధించిన వ్యక్తులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలన్నారు.